# న్యూస్ ఇండియా తెలుగు

NEWS INDIA TELUGU Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 | సంచిక :142 | ప్రచురణ : హైదరాబాద్ | శనివారం,4-04-2026 | పేజీలు: 8 | వెల : 3- 00


## 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధానిగా మారుస్తాం

- టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడిదారులకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం హామీ
- తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచమంతా ధరించేలా చేస్తామన్న రేవంత్
- సినిమా పరిశ్రమ అవసరాలను స్థానికంగా తీర్చేలా ప్రోత్సాహం
- నాణ్యమైన పత్తి, మానవ వనరులు రాష్ట్రానికి ప్రధాన బలమని వెల్లడి

**2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాకు టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ 2026లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచంలోని ప్రతి దేశంలో ప్రజలు ధరించేలా చేయాలన్నదే తన ఆశయమని అన్నారు.**



టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు. పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రాయితీలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అనుమతులు కూడా వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. "మీకు విజన్ ఉంటే, మీకు సరైన భాగస్వాములం మేమే. కలిసికట్టుగా ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ వ్యవస్థను నిర్మిద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ వస్త్రాలకు ఘనమైన చరిత్ర ఉందని, పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరల నుంచి వరంగల్ దర్రీల వరకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే అత్యధికంగా నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని తెలిపారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అందుబా టులో ఉందని వివరించారు. హైదరాబాద్ ఫిల్మ్ ప్రొడక్షన్‌కు హబ్‌గా మారుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలు ఏర్పాటు చేస్తున్నాయని సీఎం అన్నారు. బాలీవుడ్‌తో పాటు ఇప్పుడు హాలీవుడ్ కూడా హైదరాబాద్ వైపు చూస్తోందని, సినిమా పరిశ్రమ ఫ్యాషన్ అవసరాలను స్థానికంగానే తీర్చేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. పర్యావ రణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామని, యువతకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్య శిక్షణ ఇస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## బీజేపీ ఎమ్మెల్యేలు కూడా సంతోషంగా ఉన్నారు

- అట్టడుగు వర్గాలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ పుట్టిందని వ్యాఖ్య
- కార్యకర్తలు కష్టపడితేనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్న టీపీసీసీ చీఫ్
- బీఆర్ఎస్ హయాంలో లక్షల కోట్లు అప్పులు చేశారని ఆరోపణ



తమ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని బీజేపీ ఎమ్మెల్యేలు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అట్టడుగు వర్గాలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ పుట్టిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో 70 శాతం జిల్లా అధ్యక్షులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారే ఉన్నారని తెలిపారు. కార్యకర్తలు కష్టపడితేనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ప్రభుత్వాల కంటే కాంగ్రెస్ పార్టీయే శాశ్వతమని గుర్తుంచుకోవాలని అన్నారు. పార్టీ కోసం కాంగ్రెస్ కార్యకర్తలు జైళ్లకు పోయారని, లాఠీ దెబ్బలు తిన్నారని గుర్తు చేసుకున్నారు. బీఆర్ఎస్ హయాంలో లక్షల కోట్లు అప్పులు చేశారని, దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద మొత్తంలో వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో భవిష్యత్తు కాంగ్రెస్ పార్టీదే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మరో ఇరవై ఏళ్లు పార్టీ అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. విద్య, వైద్య రంగంపై కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా దృష్టి సారించిందని అన్నారు. బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అన్నారు.

## లంబాడీల భూములు లాక్కొని జైల్లో పెట్టారు

గిరిజన రిజర్వేషన్లను పెంచిన ఘనత కేసీఆర్‌దేనన్న హరీశ్

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్టీలకు మోసం జరుగుతోందని మండిపాటు

రాష్ట్ర సమస్యలను రేవంత్ గాలికి వదిలేశారని విమర్శ



నారాయణపేట జిల్లా బావోజీ జాతరలో పాల్గొన్న మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గిరిజనుల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని వివరిస్తూ, ప్రస్తుత పాలనలో గిరిజనులకు అన్యాయం జరుగుతోందంటూ మండిపడ్డారు. గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌దేనని, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులకు స్వపరిపాలన అందించారని కొనియాడారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్టీల కోసం బడ్జెట్‌లో రూ. 2,730 కోట్లు కేటాయించి, కేవలం రూ. 50 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం గిరిజనులను వంచించడమేనని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లగచర్లలో లంబాడీల భూములను బలవంతంగా లాక్కుని వారిని జైల్లో పెట్టారని హరీశ్ ఆరోపించారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ప్యాకేజీ-3 పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సమస్యలను గాలికొదిలేసి ముఖ్యమంత్రి కేరళలో గొప్పలు చెప్పుకుంటున్నారని హరీశ్ ఎద్దేవా చేశారు.

## ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీ.. సీఎంపై కవిత విమర్శలు

ప్రైవేట్ స్కూళ్లు ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తున్నాయని కవిత మండిపాటు

ఫీజు నియంత్రణ అంశాన్ని అసెంబ్లీలో సీఎం విస్మరించారని విమర్శ

ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే పాఠశాలల ముందు ఆందోళనలు చేస్తామని హెచ్చరిక

తెలంగాణలో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆమె, రాష్ట్రంలోని 12,061 ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు 25-30 శాతం పెంచి ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో ఫీజు నియంత్రణ చట్టం గురించి మాట్లాడిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అసెంబ్లీలో ఆ అంశాన్ని విస్మరించడం సరికాదని విమర్శించారు. ఫీజుల నియంత్రణకు వెంటనే ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి చట్టం తేవాలని ఆమె డిమాండ్ చేశారు. యాజమాన్యాలు ఫీజులు పెంచుతున్నా, టీచర్ల జీతాలు మాత్రం పెంచడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే పాఠశాలల ముందు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. విద్యా సంస్థల్లో తెలంగాణ వారికే ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని శాఖలకు ముఖ్యమంత్రే మంత్రిగా ఉండటం రాష్ట్ర దౌర్భాగ్యమని కవిత వ్యాఖ్యానించారు.



## కొండాపూర్ ప్రాంతంలోని క్వాక్ ఏరీనా పబ్‌లో అక్రమంగా డ్రగ్స్ దందా..!

## 8 మందికి పాజిటివ్..

- ఐఏఎస్ అధికారిణి కుమారుడికి డ్రగ్స్ పాజిటివ్...! తనకు నెగెటివ్ వచ్చిందన్న హేమ
- గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని క్వాక్ ఏరీనా పబ్‌లో కలకలం
- బ్లాక్ కాఫీ పేరిట ఈవెంట్
- ఈగల్ టీమ్ పరీక్షల్లో ఎనిమిది మందికి పాజిటివ్




హైదరాబాద్‌లోని కొండాపూర్ క్వాక్ ఏరీనా పబ్‌లో డ్రగ్స్ కలకలం చెలరేగింది. 64 మందికి పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి గంజాయి పాటిజివ్, ఇద్దరికి డ్రగ్స్ పాటిజివ్ వచ్చింది. పాజిటివ్ వచ్చిన ఎనిమిది మందిలో ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళా ఐఏఎస్ అధికారి కుమారుడు కూడా ఉన్నారని తెలుస్తోంది. పోలీసులు వీరిని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. క్వాక్ ఎరీనా పబ్ డ్రగ్ కేసులో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. క్వాక్ ఎరీనా క్లబ్‌లో 'బ్లాక్ కాఫీ' పేరిట ఈవెంట్ జరిగింది. ఈవెంట్‌లో దాదాపు 1,500 మంది పాల్గొన్నారు. ఈ సమయంలో అక్కడకు వచ్చిన ఈగల్ టీమ్ అధికారులు డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. 'బ్లాక్ కాఫీ' ఈవెంట్ జరుగుతున్న చోటుకు వెళ్లి పరీక్షలు నిర్వహించగా ఎనిమిది మందికి పాజిటివ్ వచ్చింది.

### నటి హేమకు నెగిటివ్

క్వాక్ ఎరీనా క్లబ్ పబ్ ఈవెంట్ లో ప్రముఖ సినీ నటి హేమ కూడా పాల్గొన్నారు. పరీక్షల్లో ఆమెకు నెగిటివ్ వచ్చింది. తనకు డ్రగ్ పరీక్షల్లో నెగిటివ్ వచ్చినట్లు నిర్ధారించిన కిట్‌ను ఆమె చూపిస్తూ వీడియో విడుదల చేశారు.

## జీహెచ్ఎంసీకి పెరిగిన ఆదాయం...

GHMC

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION

నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా పెరిగిన ఆదాయం

రూ.1,172 కోట్ల ఆదాయం సమకూరినట్లు జీహెచ్ఎంసీ వెల్లడి

అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.36.36 కోట్ల మేర పెరిగిన ఆదాయం

2025-26 ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)కు ఆదాయం భారీగా పెరిగింది. మొత్తం రూ.1,172.08 కోట్ల ఆదాయం సమకూరినట్లు జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు. 2025 మార్చిలోనే 15,536 నిర్మాణాలకు జీహెచ్ఎంసీ అనుమతులు మంజూరు చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీకి రూ.1,138.44 కోట్ల ఆదాయం వచ్చింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి రూ.34.36 కోట్ల మేర ఆదాయం పెరిగింది. 'బిల్డ్ నౌ' పోర్టల్ ద్వారా జీహెచ్ఎంసీ నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను జారీ చేసింది. క్యూర్ అర్బన్ రీజియన్‌లో రూ.2,558.8 కోట్ల ఆస్తి పన్ను వసూలు కాగా, జీహెచ్ఎంసీలో రూ.995.82 కోట్లు, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.100.36 కోట్లు, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.562.62 కోట్లు వసూలయ్యాయి. మార్చి నెలలో రూ.453 కోట్ల మేర ఆస్తి పన్ను బకాయిలు వసూలు కాగా, మార్చి 31వ తేదీనే రూ.162.94 కోట్లు వసూలయ్యాయి.

# కాంగ్రెస్ లో గొంతు లేస్తోంది...



కాంగ్రెస్ పార్టీ అంటే సాధారణంగా ఒక అభిప్రాయం అందరికీ ఉంది. అదే అపరిమితమైన స్వేచ్ఛ ఆ పార్టీలో ఉంటుంది. ఎవరైనా తమ సొంత అభిప్రాయాలను ఏ వేదిక మీద అయినా హాయిగా చెప్పవచ్చు. అది కాంగ్రెస్ పార్టీలా ప్లస్ అదే మైనస్ కూడా. అంతర్గత ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్ ని మించిన పార్టీ వేరొకటి లేదు. అయితే అసంతృప్తులు అయినా అయినా పార్టీ వేదికల మీద నాలుగు గోడల మధ్యన చెబితేనే బాగుంటుంది. కానీ బాహాటం అయితే పార్టీ ప్రభుత్వం రెండూ ఇబ్బందుల్లో పడతాయని అంటున్నారు. ఈసారి బడ్జెట్ సెషన్ లో కాంగ్రెస్ కి కొంత ఇరకాటం ఏర్పడే విధంగా సన్నివేశాలు కనిపించాయి. అసెంబ్లీలో నల్గొండ జిల్లా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అయితే ఏకంగా ప్రభుత్వం మీద విమర్శలు చేశారు. ఖమ్మం జిల్లాతో పాటు సీఎం సొంత నియోజకవర్గంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు చెల్లిస్తున్నారని అదే ఇతర ప్రాంతాలలో కాంట్రాక్టర్లకు పెండింగులో పెడుతున్నారని వాపోయారు. అంతే కాదు ఎమ్మెల్యేలు గెలవకపోతే సీఎం కానీ మంత్రులు కానీ ఎక్కడ అని లాజిక్ పాయింట్ లేవదీశారు. అంతటితో ఊరుకోలేదు, తన నియోజకవర్గాలలో అభివృద్ధి పనులు సాగడం లేదని అచ్చం విపక్షం గొంతుకతో విమర్శలు చేశారు. ఎమ్మెల్యేలకు నియోజకవర్గం నిధులు ఇవ్వకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఒక విధంగా కోమటిరెడ్డి మాటలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పూర్తిగా డిఫెన్స్ లో పడేశాయని అంటున్నారు ఇక శాసనమండలిలో చూస్తే ఎమ్మెల్సీ విజయశాంతి కాంగ్రెస్ ప్రభుత్వం మీద తనదైన శైలిలో విమర్శలు చేశారు. ఉద్యమ కారులకు ప్రభుత్వం చేసిన న్యాయం ఏమిటని సూటిగా ప్రశ్నించారు. వారికి ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చామని రెండేళ్ళు అవుతున్నా ఇంకా వాటిని నెరవేర్చలేదని ఆమె విమర్శించారు. ఉద్యమంలో అమరులైన కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని చెప్పారని అలాగే ఉద్యమ కారులకు నెలకు పాతిక వేల రూపాయల గౌరవ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. ఉద్యమకారులు లేకపోతే సీఎం అయినా మంత్రులు అయినా ఉండేవారా అని ఆమె నిలదీసినంత పని చేశారు. ఈ విధంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరూ తమ సొంత ప్రభుత్వం మీద విమర్శలు గుప్పించడంతో కొంత ఇబ్బందికరమైన పరిస్థితిలో ప్రభుత్వం పడింది అని అంటున్నారు. జీవన్ రెడ్డితో మొదలు : ఇక సీనియర్ మోస్ట్ కాంగ్రెస్ లీడర్ మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ మీద తీవ్ర విమర్శలు చేసి పార్టీ వదిలి వెళ్లారు. పార్టీలో ఉంటూ ఈ ఇద్దరూ ఒకింత అసంతృప్తితోనే ప్రభుత్వం మీద విమర్శలు చేశారు అని అంటున్నారు. ఇంకా చాలా మంది తమలోపల అసంతృప్తిని దాచుకున్నారు అని అంటున్నారు. ఇప్పటిదాకా ఒక ఎత్తు ఇక మీదట మరో ఎత్తు అన్నట్లుగానే ఈ పరిస్థితి కాంగ్రెస్ లో ఉందని అంటున్నారు. అయితే ఈ అసంతృప్తిని తగ్గించే ప్రయత్నం చేయాలి. అలాగే బహిరంగ విమర్శలు చేయకుండా చూసుకోవాలి. ఇప్పటి నుంచే డ్యామేజ్ కంట్రోల్ చేసుకోకపోతే విపక్షాలకు ఇది ఆయుధంగా మారుతుందని గతానుభవాలను చూసిన వారు కాంగ్రెస్ లో పెద్దలుగా ఉన్న వారు హితైషులు చెబుతున్నారు

# టార్గెట్ హరీష్ రావు...



**హైదరాబాద్, ఏప్రిల్ 3,** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు మాజీ మంత్రి హరీష్ రావు చుట్టూ తిరుగుతున్నాయి. నిన్నటి వరకు కేటీఆర్, కవితలపైనే విమర్శనాస్త్రాలు సంధించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు
తన రూటు మార్చి హరీష్ రావును టార్గెట్ చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా హరీష్ రావుపై భూకబ్జా ఆరోపణలు చేయడం, వ్యక్తిగత విమర్శలకు దిగడం వెనుకదపెద్ద రాజకీయ వ్యూహమే ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.రేవంత్ రెడ్డి నేరుగా పేరు ఎత్తకపోయినా, హరీష్ రావును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపాయి. ముఖ్యంగా కన్న తండ్రిని
పట్టించుకోని వారు.. ప్రజలను ఏం పట్టించుకుంటారు అనే అర్థం వచ్చేలా రేవంత్ చేసిన ఆరోపణలు హరీష్ రావును తీవ్రంగా ఇబ్బంది పెట్టేవిగా ఉన్నాయి. రాజకీయాల్లో ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీష్ రావుపై ఇలాంటి వ్యక్తిగత , అవినీతి ఆరోపణలు రావడం ఆయన ఇమేజ్‌కు పెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం ఇప్పటికే హరీష్ అనుచరులు, ఆయనకు సంబంధించిన భూ వ్యవహారాలపై విచారణకు ఆదేశించడం ఆయనను మరింత ఒత్తిడిలోకి నెట్టింది. ఈ పరిణామాల మధ్య కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు కొత్త ట్విస్ట్‌ను ఇచ్చాయి. రేవంత్ రెడ్డి కావాలనే హరీష్ రావును ఒంటరిని చేస్తున్నారని, కేటీఆర్ మరియు కవితలతో రేవంత్ కున్న రహస్య ఒప్పందంలో భాగంగానే ఈ వ్యూహం నడుస్తోందని సంజయ్ ఆరోపించారు. అంటే, బీఆర్ఎస్ పార్టీని హరీష్ రావు చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడానికి, కల్వకుంట్ల కుటుంబంలోని అంతర్గత విభేదాలను రేవంత్ తనకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్నది బీజేపీ వాదన. ఈ ఆరోపణల్లో నిజమెంత ఉన్నా, రేవంత్ రెడ్డి ఒక్కసారిగా హరీష్ పై పడటం వెనుక బీఆర్ఎస్ కేడర్‌ను గందరగోళానికి గురిచేసే ప్లాన్
స్పష్టంగా కనిపిస్తోంది.ప్రస్తుతానికి పరిస్థితులు హరీష్ రావుకు వ్యతిరేకంగా మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. అటు ప్రభుత్వపరంగా విచారణలు, ఇటు రాజకీయంగా సొంత పార్టీలోనే ప్రాధాన్యత తగ్గిపోతోందన్న ప్రచారం ఆయనను ఆత్మరక్షణలో పడేశాయి. కేటీఆర్ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలోనే హరీష్ రావుపై ఈ స్థాయిలో దాడులు జరగడం యాదృచ్ఛికం కాదని రాజకీయ పండితులు భావిస్తున్నారు. హరీష్ రావుకు ఉన్న మాస్ ఇమేజ్‌ను దెబ్బతీయడం ద్వారా బీఆర్ఎస్‌ను బలహీనపరచవచ్చని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.ఎన్నికల సమయంలో లేదా పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు సంక్షోభాలను చక్కదిద్దే హరీష్ రావు, ఇప్పుడు తన సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. రేవంత్ రెడ్డి విసురుతున్న సవాళ్లను ఆయన ఎలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే హరీష్ రావు తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాల్ విసిరారు. కానీ, అటు కాంగ్రెస్ ప్రభుత్వం, ఇటు బీజేపీ నేతల విమర్శల మధ్య ఆయన తన పట్టును ఎలా నిలుపుకుంటారో చూడాలి.రేవంత్ రెడ్డి వర్సెస్ హరీష్ రావు పోరు రాబోయే రోజుల్లో మరింత ముదిరే అవకాశం ఉంది. ఒకవైపు ప్రజా సమస్యలపై పోరాడుతూనే, మరోవైపు తనపై వస్తున్న అవినీతి మరకలను తొలగించుకోవాల్సిన బాధ్యత హరీష్ పై ఉంది. రేవంత్ రెడ్డి చేస్తున్న ఈ మైండ్ గేమ్ ' బీఆర్ఎస్‌లో చీలిక తెస్తుందా లేక హరీష్ రావును మరింత బలమైన నేతగా మారుస్తుందా అనేది కాలమే నిర్ణయించాలి.

# మునగ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పోషక విలువలు

**అధికంగా ఉన్న కూరగాయలలో ఒకటి డాక్టర్. యమున**

**కరీంనగర్:** : డాక్టర్. యమున తెలుపుతూ అసాధారణమైన ఆరోగ్య ప్రయోజనాల వల్ల శతాబ్దాలుగా ఇది సంప్రదాయ ఆహారాల్లో వైద్యంలో కీలక పాత్ర పోషిస్తోంది. అత్యవసర విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు,మరియు వృక్ష ఆధారిత ప్రోటీన్‌తో నిండిన మునగ ఆధునిక శాస్త్రం నిర్ధారించే చాలా ముందే ఒక సహజ సూపర్‌ఫుడ్‌గా గుర్తింపు పొందింది. మునగ చెట్టులోని ప్రతి భాగం పోషక విలువ కలిగి ఉన్నప్పటికీ,ప్రత్యేకంగా మునగకాయలు, మరియు ఆకులు అత్యంత పోషకసాంద్రత కలిగి ఉంటాయి. వీటిలో విటమిన్ సి. విటమిన్ ఏ,కాల్షియం, పొటాషియం, ఇనుము, మాగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. అలాగే మునగలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు
వాపును తగ్గించడంలో, రోగ నిరోధక శక్తిని పెంచడంలో, ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచి శరీరాన్ని కాపాడడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. దీంతో దీర్ఘకాలిక ఆరోగ్యానికి ఇది ఎంతో ఉపయోగకరం. మునగ యొక్క గొప్ప ప్రయోజనాల్లో ఒకటి హానికరమైన స్టిమ్యులెంట్లపై ఆధారపడకుండా శక్తి, ఉత్సాహాన్ని పెంచడం. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో, హృదయ ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో, జీర్ణక్రియను సరిచేయడంలో, ఎముకలను బలపరచడంలో సహాయపడుతుంది. అలసట, పోషక లోపాలు, లైఫ్‌స్టైల్‌కు సంబంధించిన ఆరోగ్య సమస్యలతో బాధపడేవారికి మునగ ఒక సహజ పునరుజ్జీవకంలా పనిచేస్తుంది మరియు జీవన నాణ్యతను మెరుగుపరుస్తుంది. భారతదేశం, ఆఫ్రికా ప్రాంతాల్లో మునగను తరచుగా జీవన వృక్షం గా పిలుస్తారు. పోషకాహార లోపాన్ని తగ్గించడం,ఆరోగ్యాన్ని మెరుగుపరచడం లో దీనికి ఉన్న శక్తి ఇందుకు కారణం. ఇది తక్కువ ఖర్చుతో లభించే,పర్యావరణానికి అనుకూలమైన, అనేక వంటకాలలో ఉపయోగించగల అత్యంత ప్రయోజనకరమైన ఆహారం. మునగ మనకు ఒక విషయం గుర్తు చేస్తుంది: అత్యంత శక్తివంతమైన మన ఆహారంలోనే సహజంగా పెరుగుతుంది. అసాధారణమైన పోషక విలువలు,వైద్య ప్రయోజనాలతో కూడిన మునగ ఒక కూరగాయ మాత్రమే కాదు ఆరోగ్యం సంక్షేమం దీర్ఘాయుష్షుకు సహకరించే ఒక ప్రకృతి వరం..

# అసమాన శాస్త్ర పరిశోధకుడు

విలియం క్రూక్స్ ప్రఖ్యాత బ్రిటిష్ భౌతిక, రసాయన శాస్త్రవేత్త. క్రూక్స్ రేడియో వికిరణ మాపకం ఆవిష్కర్త. అయన ఉత్సర్గ నాళం రూపకల్పనకు మార్గదర్శి. థాలియం అనే క్రొత్త మూలకాన్ని కనుగొన్నాడు. రాయల్ కాలేజ్ ఆఫ్ కెమిస్ట్రీ, లండన్ లో వర్ణపట శాస్త్రం పై విస్తృత పరిశోధనలు చేశాడు. ఆయన తయారుచేసిన ఉత్సర్గ నాళాన్ని క్రూక్స్ నాళం అనికూడా అంటారు. ఆయన పరిశోధనల ఫలితంగా సెలేనియం యొక్క సంయోగ పదార్థములు కనుగొనబడ్డాయి. ఆయన కేంద్రక రేడియో ధార్మికతను అధ్యయనం చేయుటకు ఉపయోగించే పరికరంను కనుగొన్నాడు. పదార్థం స్థితులలో (ఘన, ద్రవ, వాయు) నాల్గవ స్థితి అయిన ప్లాస్మాను కనుగొనుటలో, ఆ స్థితిని గుర్తించుటలో మొదటి శాస్త్రవేత్తగా నిలచాడు. క్రూక్స్ చేసిన పరిశోధనల వల్ల భౌతిక, రసాయన శాస్త్రాలలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. క్రూక్స్ తన జీవన గమనంలో ఒక అంతరిక్ష శాస్త్రవేత్తగా, ఉపన్యాసకునిగా వివిధ ప్రాంతాలలో పనిచేశాడు. భౌతిక, రసాయన శాస్త్రాలలో అనేక పరిశోధనలు చేశాడు. తన పరిశోధన ముఖ్య లక్షణము ప్రయోగముల ద్వారా వివిధ భావనలను, వాస్తవాలను కనుగొనుటగా భావించాడు. ఆయన అభిరుచు లయిన అనువర్తిత భౌతిక శాస్త్రము, ఆర్థిక, ప్రాయోగిక సమస్యలు, మానసిక సంబంధమైన పరిశోధనలు, ఆయనను ఉన్నత వ్యక్తిగా నిలిపింది. ఆయన అనేక అవార్డులు, గౌరవాలను పొందాడు. ఆయన జీవితం ఒక అసాధారణ శాస్త్రీయ కృత్యాలలతో మమేకం అయింది. సర్ విలియం క్రూక్స్ లండన్ లో 1832 జూన్ 17 లో జన్మించాడు. 1850 నుండి 1854 మధ్య కాలంలో ఆయన కళాశాలలో సహాయకునిగా పనిచేశాడు. అనతి కాలంలో ఆయన కర్బన రసాయన శాస్త్రంలో కాకుండా ఆయనకు ఇష్టమైన రంగంలో ఆయన గురువు విల్‌హెల్మ్ వోన్ హోఫ్మాన్ ప్రేరణతో ప్రవేశించాడు. ఆయన పరిశోధనల ఫలితంగా సెలేనియం యొక్క సంయోగ పదార్థములు కనుగొనబడ్డాయి. ఆయన మొదటి పరిశోధనా పత్రాలను 1851 లో ప్రచురించాడు. ఆయన ఆక్స్‌ఫర్డ్ లో రాడ్‌క్లిఫ్ అబ్సర్వేటరీ విభాగంలో 1854 లో, ఛెస్టర్ డియోసియన్ ట్రయినింగ్ కళాశాలలో 1855లో ఉపన్యాసకునిగా పనిచేశాడు. 1859 లో ఆయన కెమికల్ న్యూస్ అనే విజ్ఞానశాస్త్ర పత్రికను ప్రారంభించాడు. అనేక సంవత్సరాలు ఆ పత్రికలో వివిధ మార్పులు చేస్తూ నిర్వహించి అన్ని విజ్ఞాన శాస్త్ర జర్నల్స్ లో అగ్రగామిగా నిలిపాడు. 1861 లో క్రూక్స్ థాలియం అనే క్రొత్త మూలకాన్ని కనుగొన్నాడు. ఈ మూలకం వర్ణపటంలో ఆకుపచ్చని కాంతిని ఉద్గారం చేయుటను గమనించాడు. గ్రీకు భాషలో థల్లోస్
అంటే ఆకుపచ్చని ఉద్గారం అని అర్థము. అలా దానికి థాలియం అని నామకరణం చేశాడు. థాలియంను వర్ణపట విశ్లేషణ సహాయంతో కనుగొన్నాడు. ఆ నూతన ఆవిష్కరణ ఆయనకు ఎనలేని కీర్తిని తెచ్చి తెచ్చింది. ఆయన 1863 లో రాయల్ సొసైటీకి ఫెలోగా ఎంపికయ్యాడు. ఆయన క్రూక్స్ నాళంను అభివృద్ధి చేశాడు. తద్వారా ఋణధృవ కిరణాల ఆవిష్కరణ జరిగింది. ఆయన అనేక పరిశోధనా పత్రాలను వర్ణపట శాస్త్రం పై ప్రచురించాడు. అల్ప పీడనం వద్ద వాయువుల గుండా విద్యుత్ ను ప్రవహింపజేయు పరిశోధనలలో ఆయన అతి తక్కువ పీడనం వద్ద వాయువుల గుండా విద్యుత్ ను ప్రవహింప జేసినపుడు ఋణ ధృవం (కాథోడ్) నుండి కొన్ని కిరణాలు ఉద్గారమగు చున్నట్లు కనుగొన్నాడు. వాటికి "ఋణధృవ కిరణాలు" అని పిలిచాడు. యివి ప్రస్తుతం స్వేఛ్ఛా ఎలక్ట్రాన్ల ప్రవాహంగా పిలువ బడు తున్నాయి. ప్రస్తుతం ఇవి కాథోడ్ కిరణ నాళాలలో ఉపయోగ పడుతున్నాయి. ఈ ఉదాహరణల నుండి ఆయన భౌతిక దృగ్విషయాలను అధ్యయనం చేయుటకు ఉపయోగపడే ఉత్సర్గ నాళాల తయారీలో ప్రసిద్ధి పొందాడు. 1879 లో ఆయన పదార్థం యొక్క స్థితులలో (ఘన, ద్రవ, వాయు) నాల్గవ స్థితి అయిన ప్లాస్మాను కనుగొనుటలో, ఆ స్థితిని గుర్తించుటలో మొదటి శాస్త్రవేత్తగా నిలచాడు. క్రూక్స్ ఋణధృవ కిరణాలు లక్షణాలపై పరిశోధనలు చేశాడు. అవి ఋజుమార్గంలో ప్రయాణిస్తాయని, అవి వస్తువులపై పడినపుడు ప్రతిదీప్తిని కలుగ జేస్తాయని కనుగొన్నాడు. పదార్థంలో నాల్గవ స్థితి అయిన "ప్లాస్మా" స్థితిని ఆయన కనుగొన్నాడు. దానికి "రేడియంట్ మేటర్" అని పిలిచాడు. ఋణ ధృవ కిరణాలు అనేవి కొన్ని కణాల ప్రవాహమని నమ్మాడు. ఆ తర్వాత జె.జె.థామ్సన్ వాటిని కనుగొనడానికి భూమికను ఏర్పరచాడు. కాథోడ్ కిరణాలలో గల కణాలకు ఎలక్ట్రాన్ లుగా గుర్తించాడు. క్రూక్స్ చేసిన పరిశోధనల వల్ల భౌతిక, రసాయన శాస్త్రాలలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. దీని ఫలితంగా పరమాణువులో కొత్త కణాల ఆవిష్కరణకు మార్గం సుగమమైంది. 1880 తర్వాత క్రూక్స్ ప్రైవేటు ప్రయోగ శాలలో తన పరిశోధనలను చేశాడు. 1895 లో విలియం క్రూక్స్ హీలియం నమూనాను గుర్తించాడు. 1903 లో ఆయన తన దృష్టిని రేడియో ధార్మికత దృగ్విషయాలపై నిలిపాడు. యురేనియం –చీ (తర్వాత ప్రొటాక్టీనియంగా పిలువ బడుతున్నది. యురేనియాన్ని రేడియో ధార్మిక పరివర్తన ఆధారంగా వేరుచేయ గలిగాడు. ఉత్తేజిత పరివర్తన ఆధారంగా యురేనియం నుండి రేడియో ధార్మిక విఘటనాన్ని గమనించాడు. అదే సమయంలో ఆయన రేడియో ధార్మిక పదార్థం నుండి వెలువడే "జూ–కణముల"ను కనుగొన్నాడు. ఈ కణాలు జింక్ సల్ఫైడ్ తెరను ప్రభావితం చేయుట గమనించాడు. క్రూక్స్ 1909 లో "డైమండ్స్" అనే చిన్న పుస్తకాన్ని రాశాడు. 1910లో క్రూక్స్ "ఆర్డర్ ఆఫ్ మెరిట్"ను పొందాడు. ఆయన తన భార్య మరణానంతరం 2 సంవత్సరాల తర్వాత లండన్ లో 4 ఏప్రిల్ 1919 లో మరణించాడు.

# గనుల తవ్వకాలు: పర్యావరణ ధ్వంసం

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 4వ తేదీన అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటారు. ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని 2005లో ప్రారంభించింది. యుద్ధాలు, సాయుధ పోరాటాలు ముగిసిన తర్వాత కూడా భూమిలో మిగిలి పోయిన మందు పాతరలు, పేలుడు పదార్థాల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. అంతే కాకుండా, వీటిని నిర్మూలించ డానికి జరుగుతున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడం, బాధితులకు సహాయం అందించడం కూడా ఈ దినోత్సవం లక్ష్యాలలో ముఖ్యమైనవి. యుద్ధాలు ముగిసిన తరువాత కూడా మందుపాతరలు ఒక పెద్ద సమస్యగా మిగిలి పోతాయి. ఇవి పొలాలు, రహదారులు, నివాస ప్రాంతాలు ఇలా ఎక్కడైనా ఉండవచ్చు. వీటి గురించి తెలియని సామాన్య ప్రజలు, ముఖ్యంగా పిల్లలు, రైతులు, పేదవారు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. మందు పాతర పేలినప్పుడు ప్రాణనష్టం జరగవచ్చు లేదా శాశ్వత వైకల్యం సంభవించవచ్చు. అంతే కాకుండా, ఇది దేశాల ఆర్థికాభివృద్ధికి కూడా ఆటంకం కలిగిస్తుంది. వ్యవసాయ భూములు నిరుపయోగంగా మారతాయి, రవాణా వ్యవస్థ స్తంభించి పోతుంది, ప్రజలు భయంతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవం ప్రధాన లక్ష్యాలలో...మందు పాతరల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం, మందు పాతరల నిర్మూలనకు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ప్రాజెక్టులకు ఆర్థికంగా, ఇతర విధాలుగా మద్దతు అందించడం, మందు పాతరల బాధితులకు అవసరమైన వైద్య సహాయం, మానసిక మద్దతు, పునరావాస సౌకర్యాలు కల్పించడం, మందు పాతరల సమస్య యొక్క తీవ్రతను తెలియ జేయడం, దీని పరిష్కారానికి అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడం. ఈ దినోత్సవం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజ సంస్థలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. వీటిలో కొన్ని ముఖ్యమైనవి... మందు పాతరల ప్రమాదాల గురించి అవగాహన కల్పించే ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించడం. మందు పాతరల నిర్మూలనకు సంబంధించిన విషయాలపై చర్చాగోష్ఠులు సెమినార్లు ఏర్పాటు చేయడం. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం. మందు పాతరల నిర్మూలనలో పాల్గొనే వారికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం. మందు పాతరల బాధితులకు మానసిక మరియు వైద్య సహాయం అందించడం, వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం. మందుపాతరల సమస్యపై ప్రజలను చైతన్యవంతం చేయడానికి మీడియా ప్రచారం నిర్వహించడం.
భారత దేశంలో కూడా సరిహద్దు ప్రాంతాలలో మందు పాతరల సమస్య ఉంది. భారత సైన్యం ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడంలో కీలకమైన పాత్ర పోషిస్తోంది. అయితే, ఈ సమస్య తీవ్రతను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. మందు పాతరల గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు, గనుల తవ్వకం కూడా పర్యావరణానికి తీవ్రమైన నష్టం కలిగిస్తుంది. గనుల నుండి వెలువడే వ్యర్థ పదార్థాలు నేల, నీరు, గాలిని కలుషితం చేస్తాయి. దీనివల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. అంతే కాకుండా, గనుల కోసం అడవులను నరకడం వల్ల వన్య ప్రాణులు వాటి ఆవాసాలను కోల్పోతాయి. జీవ వైవిధ్యానికి నష్టం వాటిల్లుతుంది. గనులలో పనిచేసే కార్మికులకు కూడా ఆరోగ్య సమస్యలు మరియు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కాబట్టి, గనుల తవ్వకం విషయంలో పర్యావరణ హిత విధానాలను అనుసరించడం, కార్మికుల భద్రతను నిర్ధారించడం చాలా ముఖ్యం. అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవం కేవలం ఒక రోజుకు మాత్రమే పరిమితం కాకూడదు. మందు పాతరల సమస్య తీవ్రతను గుర్తించి, దీనిని నిర్మూలించ డానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి. బాధితులకు సహాయం అందించడానికి ముందుకు రావాలి. భవిష్యత్ తరాలకు సురక్షితమైన ప్రపంచాన్ని అందించడమే మనందరి లక్ష్యం. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి మందుపాతరల గురించి అవగాహన పెంచుకోవడం, ఈ సమస్యపై పోరాడటానికి కలిసి రావడం చాలా అవసరం.

# గజ్వేల్, సిద్దిపేటలో ప్రశాంతంగా హనుమాన్ జయంతి వేడుకలు

సిద్ధిపేట జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా,ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిర్వహించబడ్డాయి. ముఖ్యంగా గజ్వేల్ మరియు సిద్దిపేట పట్టణాలలో భారీ ఎత్తున శోభాయాత్రలు నిర్వహించ బడ్డాయి.వేడుకల సందర్భంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. ముందస్తు ప్రణాళికతో పోలీసులు విస్తృతంగా బందోబస్తు ఏర్పాటు చేసి, శాంతి భద్రతలను సమర్థంగా నిర్వహించారు. శోభాయాత్రల కారణంగా సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను సక్రమంగా మళ్లించడం జరిగింది.ర్యాలీలు సాగిన మార్గాల్లో విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు.
శాంతి భద్రతలను కాపాడటంలో సహకరించిన ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది మరియు ప్రజలకు కమిషనర్ ఆఫ్ పోలీస్ రష్మీ పెరుమాళ్, ఐ ధన్యవాదాలు తెలిపారు.



## ఆరోగ్య భద్రతనిస్తూ మెరుగైన వైద్యాన్ని అందించేది ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసీ.....



**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 3 (న్యూస్ ఇండియా ప్రతినిధి )** అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న ఇద్దరూ లబ్ధిదారులకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను ఈరోజు చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన లబ్దిదారులకు అందజేశారు. ఎల్వోసీ పత్రాల అందజేతలో భాగంగా 131 – కుత్బుల్లాపూర్ డివిజన్ లబ్ధిదారుడు తోట నాగేశ్వర రావు తండ్రి టీ. రామదాసు కు 1,50,000/- (లక్ష యాభై వేల రూపాయలు) మంజూరు కాగా మరొక లబ్ధిదారుడు 127 – రంగారెడ్డి నగర్ డివిజన్ కు చెందిన ఎం. నర్సింగ్ రావు తండ్రి ఎం.ఆనంద్ రావుకు 2.00 లక్షలు (రెండు లక్షల రూపాయలు) మంజూరైన ఎల్వోసీ పత్రాలను ఆయా డివిజన్లకు చెందిన నాయకులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సుధాకర్, కిషోర్ చారి, నార్లకంటి బాలయ్య, జల్ద లక్ష్మీ నారాయణ, ఎర్వ సాయి కిరణ్ (బంటి), ఎండీ. నసీరుద్దీన్, ఆంజనేయులు, రమణా రెడ్డి, కొత్త నర్సింహా రెడ్డి, కళ్లెం శ్రీనివాస్, రహీం, అల్లావుద్దీన్, డీజే.రమేష్, తిమ్మయ్య, రాంచందర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిపై అక్రమ కబ్జా యత్నం... నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ ఆరోపణలు..



**రంగారెడ్డి జిల్లా, తుర్కయంజాల్, ఏప్రిల్ 03, న్యూస్ ఇండియా ప్రతినిధి:** అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ వార్డు పరిధిలోని మునుగునూరు గ్రామంలో ప్రభుత్వ భూమిపై అక్రమ కబ్జా యత్నం వెలుగుచూసింది. సర్వే నంబర్ 35కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ సర్వే నంబర్ 38లోని భూమిని తప్పుడు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. తొర్రూర్‌కు చెందిన నల్లబోలు జంగారెడ్డి అనే వ్యక్తి, పాత ఆంధ్రప్రదేశ్ పాస్‌బుక్ (సర్వే నంబర్ 35ఇ)ను ఆధారంగా చూపిస్తూ 2025లో వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సమాచారం. అనంతరం ఆ భూమిని 300 గజాలు, 90 గజాలుగా విభజించి బోల్గురి నర్సింహకు విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో 36 గుంటలుగా ఉన్న భూమిని 17 ప్లాట్లుగా మార్చి, తరువాత 18, 19 ప్లాట్లుగా చూపిస్తూ పాత లేఅవుట్‌ను మార్చి అధికారులను తప్పుదోవ పట్టించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై అప్రమత్తమైన స్థానికులు ఏప్రిల్ 2న అబ్దుల్లాపూర్‌మెట్ ఎమ్మార్వోకు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయడంతో అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా, మట్టిదిబ్బలు తానే వేసినట్లు ఒప్పుకున్నాడని తెలిసింది. ప్రభుత్వ భూమిలో మట్టిని ఎలా వేసారని అధికారులు ప్రశ్నించగా, తాను వెంటనే తొలగిస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే హామీని విస్మరించి గురువారం అర్ధరాత్రి నుండి శుక్రవారం తెల్లవారుజామున మధ్యలో మరోసారి 10 లారీల మట్టిని పోయించి వెళ్లినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై స్థానికులు సిపిఎం నాయకులకు సమాచారం అందించగా, వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజలతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం వెంకటేశ్వర కాలనీ అసోసియేషన్ నాయకులు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాబట్టి ఈ అంశాన్ని రెవెన్యూ అధికారులు అత్యవసరంగా పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు, కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపల్ కార్యదర్శి డి. కిషన్, మున్సిపల్ కమిటీ సభ్యులు ఎం. సత్యనారాయణ, పి. శ్రీనివాసులు, వెంకటేశ్వర కాలనీ ప్రతినిధులు రామిరెడ్డి, సాయి గౌడ్, కోశాధికారి కే. ఆంజనేయులు, సభ్యులు ఎం. బాలు నాయక్, ప్రదీప్, సైదులు, రవి, లింగారెడ్డి, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ సాధించకపోతే రాజీనామాకు సిద్ధం:....



ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్....

**హైదరాబాద్, ఏప్రిల్ 3 (న్యూస్ ఇండియా ప్రతినిధి)** తెలంగాణలో ముదిరాజ్ సమాజం ఎదుర్కొంటున్న రిజర్వేషన్ సమస్యలు పరిష్కరించకపోతే తాను మంత్రి వాకిటితో కలిసి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ స్పష్టం చేశారు.
శుక్రవారం హైదరాబాద్ బోయిగూడలో జరిగిన రాష్ట్ర ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం అత్యవసర సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ముదిరాజ్ సమన్వయ కమిటీ ఏర్పాటు అవసరం, బీసీ–డి నుంచి బీసీ–ఏ లోకి వర్గీకరణ వ్యూహాలు, కోకాపేటలో ముదిరాజ్ భవన నిర్మాణం, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.
జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం తర్వాత ముదిరాజ్ సమాజ అభివృద్ధికి ఎంతో కృషి జరిగినప్పటికీ, ఐక్యత లోపించడం వల్ల ఆశించిన ఫలితాలు రాలేదన్నారు. ప్రస్తుతం అనేక సంఘాలు ఏర్పడి కులాన్ని విభజిస్తున్నాయని, అందుకే అన్ని వర్గాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే సమన్వయ కమిటీ అత్యవసరమని తెలిపారు.
ఇటీవల ఈటెల, కాసాని, బండ ప్రకాష్, మంత్రి వాకిటి వంటి నాయకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సర్పంచుల సన్మాన కార్యక్రమం నిర్వహించామని గుర్తుచేశారు. త్వరలో మీడియా, న్యాయ, మహిళ, యువజన విభాగాలతో సమగ్ర సమన్వయ కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు.
కోకాపేటలో ముదిరాజ్ భవనానికి స్థలం ఉన్నప్పటికీ నిధుల కొరత ఉందని, సమాజం సహకరిస్తే నిర్మాణాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.
ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, రిజర్వేషన్ సాధనలో న్యాయపరమైన అడ్డంకులు తొలగించాల్సిన అవసరం ఉందని సూచించారు. సమన్వయ కమిటీని నియోజకవర్గం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఏర్పాటు చేసి, స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అభిప్రాయపడ్డారు.
జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధి, మీడియా హబ్ ఏర్పాటు, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది. భవిష్యత్తులో భారీ బహిరంగ సభ నిర్వహించి, సమాజ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు.
ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు చింతల నిలకంఠం ముదిరాజ్, బోయిని శ్రీనివాస్ ముదిరాజ్, బలరాం ముదిరాజ్, మేడ్చల్ జిల్లా జర్నలిస్ట్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సుగ్రీవ్ ముదిరాజ్,కాసాని రంజిత్ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, పాండురంగం ముదిరాజ్, జే.శివ, ఎన్. శివ,బిక్షపతి ముదిరాజ్, బాబు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఒకటి కూల్చేసి.... ఇంకోటి వదిలేసి...!:



- అక్రమ నిర్మాణాలపై రెవిన్యూ అధికారుల ద్వంద వైఖరి!:
- చర్చ్ గాగిల్లాపూర్ లో అక్రమ నిర్మాణం:
- దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా!:

**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 3 (న్యూస్ ఇండియా ప్రతినిధి)** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ చర్చ్ గాగిల్లాపూర్ లో కబ్జాదారులు బరి తెగిస్తున్నారు. సర్వే నెంబర్ 214 లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పట్టపగలే దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవిన్యూ అధికారుల నిఘా వైఫల్యంతో ఈ ప్రాంతం లో కబ్జాలు చేయడం చాలా సులువుగా మారిందని చెప్పవచ్చు.రెవిన్యూ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం తో తమకు అడ్డుఅదుపే లేదనట్టుగా కబ్జాదారులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రూమ్ ల నిర్మాణం చేపడుతున్నారు.
ఇంత ఉదాసీనత ఎందుకు?: ముడుపులు అందితే అక్రమ నిర్మాణాలను కూల్చకుండా వదిలేస్తాం, ముడుపులు అందకుంటే.... పిర్యాదులు అందితే కూల్చేస్తాం అన్నట్టుగా వుంది దుండిగల్ మండల రెవిన్యూ అధికారుల పనితీరు! మండల పరిధిలోని చర్చ్ గాగిల్లాపూర్ లోని సర్వే నెంబర్ 214 లో ఇటీవల కొందరు వ్యక్తులు వేరువేరు చోట రెండు అక్రమపలు నిర్మాణాలను చేపట్టారు.పలు పిర్యాదులు అందుకున్న రెవిన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఒక రూమ్ ను కూల్చివేసి అక్కడికి కూతవేటు దూరంలోనే చేపట్టిన ఇంకో అక్రమ నిర్మాణాన్ని చూసిచూడనట్టుగా వదిలేసారు!దీంతో అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలు వెళ్ళువెత్తుతున్నాయి. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపడాలని పలువురు కోరుతున్నారు.


## పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య కురుమకు ఘన నివాళి..

**రంగారెడ్డి జిల్లా, తుర్కయాంజాల్, ఏప్రిల్ 03, న్యూస్ ఇండియా ప్రతినిధి:** బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయాంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పట్నం రమేష్ కురుమ అధ్యక్షతన తుర్కయాంజాల్ డివిజన్‌లో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన పద్మశ్రీ అవార్డు గ్రహీత, 12 మెట్ల కిన్నెర వాయిద్యకారుడు డా. దర్శనం మొగులయ్య కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నిర్మూలన కోసం వీరోచితంగా పోరాడిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్యను తెలంగాణ సమాజం ఎన్నటికీ మరవదని పేర్కొన్నారు. కొమురయ్య ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొత్త కురుమ శివకుమార్,



కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు ఓరుగంటి యాదయ్య, బహుజన్ సమాజ్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కార్యదర్శి వద్దగల్ల బాబు, కాంగ్రెస్ పార్టీ తుర్కయాంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ శివకుమార్, బీఎస్పీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు లపంగి రాజు, ప్రధాన కార్యదర్శి మల్లెల రఘు, మాజీ ఉపాధ్యక్షుడు మేతరి కుమార్, మాజీ కార్యదర్శి భూతం రమణ, గుడ్ల అర్జున్, ఆర్ల కృష్ణతో పాటు పలువురు మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డుపై మట్టి కుప్పలు.. వాహనదారుల అవస్థలు!



**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, ఏప్రిల్ 03, న్యూస్ ఇండియా ప్రతినిధి:** ఎల్బీనగర్ జోన్ నాగోల్ సర్కిల్ పరిధిలోని పెద్ద అంబర్పేట్ డివిజన్ సూర్యవంశీ కాలనీ వద్ద అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. వారం రోజుల క్రితం రోడ్లను ఊడ్చిన అనంతరం మట్టిని అక్కడికక్కడే కుప్పలుగా వదిలేయడంతో అవి ప్రమాదాలకు కేంద్రంగా మారాయి. రోడ్డుమధ్యలో పేరుకుపోయిన మట్టి కుప్పల కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఈ కుప్పలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలకు దారితీస్తున్నాయి. దీనికి తోడు డ్రైనేజీ నీరు రోడ్డుపైకి చేరడంతో పరిస్థితి మరింత విషమంగా మారింది. ఇటీవల ఇదే ప్రాంతంలో కారు–బైక్ ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడటం స్థానికులను ఆందోళనకు గురిచేసింది. ప్రమాదాల ముప్పు పెరుగుతున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి మట్టి కుప్పలను తొలగించి, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# అమరవీరుడు దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

- దొడ్డి కొమరయ్య అమరుడు
- ఆయన స్ఫూర్తి చిరస్థాయి
- విసునూరు గడీలను గడగడలాడించిన ఉద్యమ బిడ్డ
- తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు దొడ్డి కొమురయ్య

**నర్సింహులపేట,న్యూస్ ఇండియా ప్రతినిధి (సాయి)** తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ 99 వ జయంతి సందర్భంగా నర్సింహులపేట మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ పోరాటంలో ప్రాణం అర్పించిన తొలి అమర వీరుడు దొడ్డి కొమరయ్య వారి త్యాగాలు ఎప్పటికీ మర్చిపోలేనిది, ఆయన చూపిన ధైర్యం పోరాట స్ఫూర్తి నీది తరాలకు మార్గదర్శకం దొడ్డి కొమరయ్య అమరుడు.. హాయ్ రా స్ఫూర్తి చిరస్థాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాస యాకయ్య యాదవ్, రేఖ అనిల్ యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల యూత్ ప్రధాన కార్యదర్శిలు నిమ్మల శ్రీనివాస్ యాదవ్, బిజెపి మండల అధ్యక్షుడు సూరబోయిన సతీష్ యాదవ్, హమాలి సంఘం మండల అధ్యక్షుడు సూరబోయిన మల్లయ్య యాదవ్, యాదవ సంఘం నాయకులు రేఖ శ్రీను యాదవ్, తండా యాకయ్య యాదవ్, సూరబోయిన వీరన్న, వీరబోయిన అశోక్, భోగి అనిల్, భూక్య రెడ్యా, సమ్మెట రమేష్ యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# డబ్బు, వ్యాపారమయమైన రాజకీయాలను..
# చైతన్యంతోనే తిప్పికొట్టగలం..

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్..
- ఎల్బీనగర్ లో దొడ్డి కొమరయ్య విగ్రహావిష్కరణ..

**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, ఏప్రిల్ 03 న్యూస్ ఇండియా ప్రతినిధి:**ఐక్యత, చైతన్యం ద్వారానే బీసీలు రాజకీయంగా.. ఆర్థికంగా, వ్యాపారంగా ఎదుగగలరని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య విగ్రహావిష్కరణ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మధుయాష్కీ దొడ్డి కొమరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎస్కే గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మధుయాష్కి మాట్లాడుతూ.. నిజాం అరాచక పాలన, దేశ్ ముఖ్ ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణ త్యాగం చేసిన దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తి తో బహుజనులు రాజకీయంగా చైతన్యం కావాలన్నారు. డబ్బుమయమైన ప్రస్తుత రాజకీయాలను ఆర్థికంగా ఎదుర్కొనే ఎదుర్కొనే స్తోమత బీసీలకు లేదని.. కేవలం చైతన్యం ద్వారానే రాజ్యాధికారం సాధించగలమని సూచించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాటంలో ప్రాణాలు పోగొట్టుకొని అన్ని విధాలుగా నష్టపోయింది బీసీలేనని .. తెలంగాణ వచ్చాక కూడా అన్ని విధాలుగా నష్టపోయింది కూడా బీసీ లేనని పేర్కొన్నారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో బీసీలకు గొర్లు బండ్లు ఇచ్చి వాళ్ళు మాత్రం వేల కోట్లు దోచుకున్నారన్నారు. చైతన్యం లేకనే బీసీలు ఎన్నికల్లో




నిలబడితే గెలిపించుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుల సంఘాలలో కొందరు దోపిడీదారులు ఉంటారని వారిని గుర్తించి పక్కకు పెట్టినప్పుడే.. సంఘం, కులం బలపడుతుందని పేర్కొన్నారు. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హాయంలో నగరంలో కల్లు దుకాణాలను బంద్ చేస్తే తాను నిజాం కాలేజీలో సభ పెట్టి పోరాడానని పేర్కొన్నారు. కుల సంఘాల భవనాలను ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలకు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి వ్యాపార ధోరణిని ఆ కుల సంఘాల ప్రతినిధులు చైతన్యంతో తిప్పుకొట్టాలని సూచించారు.

కార్యక్రమంలో కేవైసీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్ కురుమ, ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షులు మల్లేష్ కురుమ, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకాల శ్యాం కురుమ, రాష్ట్ర నాయకులు రవికుమార్ కురుమ, కే వెంకటేశ్ కురుమ, గౌడ్ రాజకుమార్, రావుల ఐలయ్య, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు గౌడ్, బుడ్డ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు వేణుగోపాల్ యాదవ్, రేణు గౌడ్, శరత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు



సర్పంచ్ జక్కుల ఉప్పలయ్య

**నర్సింహులపేట,న్యూస్ ఇండియా ప్రతినిధి (సాయి)**నర్సింహులపేట మండలం పడమటిగూడెం గ్రామంలో గ్రామ సర్పంచ్ జక్కుల ఉప్పలయ్య, ఉప సర్పంచ్ చిమ్మల నవీన్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. బాలవికాస ఆధ్వర్యంలో దాసోరోజు కనుక చారి గ్రామ ప్రజల సహకారంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ జక్కుల ఉప్పలయ్య మాట్లాడుతూ... వేసవిలో ప్రజల దహార్తిని తీర్చేందుకే ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సిరిమల ప్రభాకర్, ఎస్.కె మైబు, నూకల హరీష్, బాబు, కంబాల నాగలక్ష్మి, ఛాన్వి గ్రూప్ లీడర్స్ జక్కయ్య కాంత, దాసరోజు జానకమ్మ, చిర్ర నాగమణి, చిర్ర భద్రమ్మ, యాకమ్మ, బాలవికాస ప్రతినిధులు స్వర్ణలత, గుగ్గిళ్ళ స్వరూప, రాణి, గ్రూపు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విమర్శల చెరలో అధికార ప్రభుత్వం..

- “మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు, అధికార ప్రభుత్వానికి అనుకొని ఎదురు దెబ్బలు. “
- “మేడారం మహా జాతర కీర్తికే, అపకీర్తి తెచ్చిపెట్టిన ఘటన.”
- “మేడారం అభివృద్ధి మొత్తం నాదే” అనే విధంగా ప్రగాధలు పలికిన మంత్రి జరిగిన నష్టానికి బాధ్యత కూడా వహించాలి బి.ఆర్.ఎస్ పార్టీ డిమాండ్.”
- “కమిషన్ల కక్కుర్తి, బాలుడి భవిష్యత్తుకి శాపంగా మారింది.”
- “మండలంలో పట్టు కోల్పోతున్న ఆ పార్టీ నాయకులు.”
- “మేడారం సమ్మక్క గద్దెల వద్ద గాయపడ్డ బాలుడి యువాన్ ను పరామర్శించిన.”
- “ ములుగు జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు”
- “మేడారం కనికట్టు - కట్టడాలు 1000 ఏళ్ల నిలిచిపోయే చరిత్ర అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ఒక నిండు బాలుడి 100 ఏళ్ల జీవితానికి ఆనకట్ట వేసింది”



**న్యూస్ ఇండియా ప్రతినిధి:**ములుగు జిల్లా మేడారం సిద్ధబోయిన రమేష్ కుటుంబానికి 25 లక్షల ఎక్స్ గ్రేషియా మరియు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి...తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో గత నెల 25వ తేదీన మేడారం గద్దెల వద్ద ప్రమాదానికి గురైన పూజారి సిద్ధబోయిన రమేష్ కుమారుడు యువన్(6 సంవత్సరాలు సమ్మక్క గద్దె వద్ద ఆడుకుంటున్న సమయంలో గద్దె కు ఉన్న సైడ్ బండలు ఊడి ప్రమాదం జరిగినది.. వైద్య నిమిత్తం హాస్పటల్ తరలించగా బాలుడు యువన్ కాలు పూర్తిగా నుజ్జు నుజ్జు కావడంతో కాలు తొలగించిన వైద్యులు మరొక కాలు కూడా ఫ్యాక్చర్ కావడం జరిగినది..బాలుడు యువాన్ పరిస్థితి చాలా బాధాకరంగా ఉందని లక్ష్మణ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు..మేడారం ప్రమాదంలో గాయపడ్డ బాలుడి కుటుంబానికి 25 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని మరియు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వాలని ఈ సందర్భంగా ములుగు జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కాకుల మర్రి లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారు....గతంలోనే ఎన్నోసార్లు బి.ఆర్.ఎస్ పార్టీ పక్షాన అనేకసార్లు నాణ్యత లోపిస్తుందని చెప్పినప్పటికీ ప్రభుత్వం మరియు కాంట్రాక్టర్లు మంత్రులు పెడచెవిన పెట్టి కాసులు కక్కుర్తి కోసం నిరుపేద అయినా సమ్మక్క పూజారి సిద్ధబొయిన రమేష్ కొడుకు యావన్ ఒక కాలు పూర్తిగా తీసివేయగా మరొక కాలు అంగవైకల్యంలోనే ఉండడం చాలా బాధాకరమని దీనికి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారు.. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రులు సీతక్క కళ్ళు తెరిచి మేడారంలో జరిగిన సంఘటనపై విచారణ జరిపించి. సంబంధిత అధికారులు కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాలని మరియు ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా ఉండేందుకు మేడారం అభివృద్ధి పనులను సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించి బాధ్యులపై చర్య తీసుకొని మరియు రాబోయే రోజుల్లో ప్రమాదాలు జరగకుండా చూడాలని ములుగు జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ప్రభుత్వనికి విజ్ఞప్తి చేశారు.

మేడారం సమ్మక్క సారక్క పూజారి సిద్ధబోయిన రమేష్ కుటుంబానికి బి.ఆర్.ఎస్ పార్టీ అండగా ఉంటుందని వారు తెలుపడం జరిగింది..

ఈ కార్యక్రమంలో ఏటురునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావు ఎండి వాలి బాబా బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు....

## పంది రాజు కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నూతి సత్యనారాయణ.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**జిల్లా కాంగ్రెస్ నాయకులు, గౌడ రాష్ట్ర యువ సంఘం అధ్యక్షులు నాయకులు పంది రాజు పుట్టినరోజు సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గారి నివాసానికి 100 మంది కాంగ్రెస్ కార్యకర్తలతో వెళ్లి వారి ఆశీస్సులు తీసుకొని తన 34వ పుట్టినరోజు ను కాంగ్రెస్ కార్యకర్తల మధ్యన జరుపుకున్నారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ కేక్ కట్ చేసి పంది రాజుకి తినిపించి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు . అనంతరం పలువురు రాజుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, గౌడ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో 99వ దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు.



**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 3.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో , దొడ్డి కొమరయ్య కురుమ 99వ జయంతిని వలిగొండ పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కురుమ కులస్థులు మరియు బీసీ సంఘాల నాయకులు పాల్గొని దొడ్డి కొమరయ్య ఆశయాలు సాధించాలని మరియు కురుమ కులస్థులు సంఘటితంగా ఉండి రాజకీయంగా ఎదగాలని,మన హక్కులు కాపాడుకోవాలని కోరడం జరిగింది, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రేగు బీరప్ప , ఈతప రాములు, ఈతప నరసింహా, ఎమ్మె మల్లేష్ కంకల కిష్టయ్య,బీసీ నాయకులు సాయిని యాదగిరి, రామచంద్రు. మల్గ నాగులు, కొక్కల శ్రీనివాస్, మోటె సత్యనారాయణ,రేగు శ్రీధర్, ఉలిపే పాండు, రేగు మల్లికార్జున్, కౌడె కృష్ణ, ఎమ్మె లింగస్వామి,మల్గ నరేష్, ఈతప నరేశ్, కౌడె నరేష్,మోటే సాయి, ఉలిపే లోకేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.జై కురుమ జై కురుమ.

## క్రీస్తు త్యాగం... సమస్త మానవాళికి స్ఫూర్తిదాయకం...

- నాగులవంచ గ్రామంలో గుడ్ ఫ్రైడే వేడుకలు...
- తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు గుడ్ ఫ్రైడే సందర్భంగా అన్నదానం...



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండల పరిధిలో నాగులవంచ గ్రామంలోఆర్ సి యం చర్చి ఫాదర్ రఫెల్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెఫెల్ ఫాదర్ మాట్లాడుతూ...యేసుక్రీస్తు సిలువ త్యాగాన్ని, మానవాళిపై ఆయన చూపిన అపారమైన ప్రేమను స్మరించుకునే పవిత్రమైన రోజు గుడ్ ఫ్రైడే ఈ రోజు పాప క్షమాపణకు, నిత్యజీవానికి మార్గం సుగమం చేసిన దినం. ప్రార్థన, ధ్యానంతో కూడిన పవిత్రమైన గుడ్ ఫ్రైడే రోజు ఆయన గురించి స్మరించుకోవాలి, నాగులవంచ గ్రామం వీధిలో తిరుగుతూ.. అలనాడు యేసుక్రీస్తును ముళ్ళ కొరటాలతో కొట్టి, రక్తం చిందింప చేసి, సిలువ వేసిన సన్నివేశాలను కళ్ళకు కట్టే విధంగా యాత్రల నిర్వహించారు. తదనంతరం చర్చిలో ప్రార్థన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 40 రోజులు ఉపవాసం ఉన్న బ్రదర్స్ సిస్టర్ కు దీక్ష విడుములు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు మాట్లాడుతూ.గుడ్ ఫ్రైడే అనేది యేసుక్రీస్తు సిలువ త్యాగాన్ని, మానవాళి కోసం ఆయన చేసిన అపారమైన ప్రేమను, త్యాగాన్ని స్మరించుకునే అత్యంత పవిత్రమైన రోజు. ఈ దినం ఆత్మపరిశీలన, ప్రార్థన మరియు నిశ్శబ్దంతో ఆయన త్యాగాన్ని గౌరవించాలి. ఈ ప్రత్యేక దినాన శాంతి, ప్రేమ మరియు క్షమాగుణం మన జీవితాల్లో నిండాలని కోరుకుందాం. తెలియజేశారు.చర్చికి వచ్చిన భక్తులకు సుమారు 700 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మరియు కూలింగ్ వాటర్ వచ్చిన భక్తులకుఅందజేశారు. ఈ కార్యక్రమంలో బాన్కలి శాంతి నిలయం సిస్టర్స్ వివిధ గ్రామాల నుండి భక్తులు, సంఘస్తులు, దీక్ష సహోదరి సహోదరులు, పంతులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ ఇండియా
నిజం మా ఇజం

# ఎడిటోరియల్

## అమెరికా సాంకేతికతపై ఇరాన్ సవాలు

పశ్చిమాసియాలో 2026 ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణ మాత్రమే కాక, దశాబ్దాలుగా కొనసాగుతున్న ఏకధ్రువ ప్రపంచ క్రమం కుప్పకూలుతున్న ఒక చారిత్రక ఘట్టంగా పరిణమించింది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై ప్రారంభించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ', 'ఆపరేషన్ రోరింగ్ లయన్' ప్రారంభంలో కొన్ని విజయాలను సాధించినప్పటికీ, ఇరాన్ పటిష్టమైన యుద్ధతంత్రం, అసిమెట్రిక్ యుద్ధ నైపుణ్యం ముందు ఆ అగ్రరాజ్యాల సాంకేతిక గర్వం నీరుగారిపోయింది. ముఖ్యంగా, అమెరికా గర్వపడే గగనతల నిఘా వ్యవస్థలకు వెన్నెముకవంటి అవాక్స్ విమానాన్ని ఇరాన్ కూల్చివేయడం,ఆ దేశపు రక్షణ వ్యవస్థలోని లొసుగులను ప్రపంచానికి చాటిచెప్పింది. ఈ యుద్ధం కేవలం సైనికపరంగానే కాకుండా, ఆర్థికంగా కూడా అమెరికాను దివాలా అంచుకు నెట్టివేసింది. అదే సమయంలో ఇజ్రాయెల్ ఒక పరాన్న దేశంగా తన ఉనికిని కాపాడుకోవడానికి ఎంతగా అమెరికాపై ఆధారపడి ఉందో స్పష్టమైంది. రష్యా, చైనా, ఇండియా వంటి ఎదుగుతున్న శక్తులు ఇప్పుడు ఏకమై ఒక చిన్న తోపు తోస్తే, పాత ప్రపంచ క్రమం అంతమై ఒక నూతన బహుధ్రువ ప్రపంచం ఆవిర్భవించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. మార్చి 2026 చివరి వారంలో జరిగిన ఒక కీలక పరిణామం యుద్ధగమనాన్ని పూర్తిగా మార్చివేసింది. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌మీద ఇరాన్ జరిపిన డ్రోన్, మిస్సైల్ దాడిలో అమెరికాకు చెందిన అత్యంత శక్తివంతమైన ఇ-3 సెంట్రీ(అవాక్స్) విమానం ధ్వంసమైంది. ఈ విమానం కేవలం ఒక వాహనం కాదు. అది గగనతలంలో కదిలే ఒక కమాండ్ సెంటర్. ఇది సుమారు 250 మైళ్ల (375 కిలోమీటర్లు) పరిధిలోని ప్రతి చిన్న కదలికను -అవి డ్రోన్లు కావచ్చు, క్షిపణులు కావచ్చు, యుద్ధవిమానాలు కావచ్చు- అన్నింటినీ గుర్తించి సమాచారాన్ని అందిస్తుంది. ఈ సాంకేతిక పరిజ్ఞానంతోనే అమెరికా ప్రపంచ దేశాలపై ఇన్నాళ్లూ తన పెత్తనాన్ని చలాయించింది. అయితే ఇరాన్ తన పటిష్టమైన యుద్ధతంత్రంతో ఈ 'కదిలే రాడార్'ను మట్టుబెట్టడం ద్వారా అమెరికా గగనతల ఆధిపత్యాన్ని సవాలు చేసింది.

అవాక్స్‌ను కోల్పోవడంవల్ల అమెరికా సైన్యానికి యుద్ధ రంగంలో ఏం జరుగుతుందో తెలియని 'అంధత్వం' ఏర్పడింది. దీనివల్ల క్షేత్రస్థాయిలో ఉన్న రాడార్లపై ఆధారపడాల్సి రావడం, అవి కూడా ఇరాన్ దాడులకు గురవుతుండడంతో అమెరికా రక్షణ వ్యవస్థలో తీవ్రమైన అసమతుల్యత ఏర్పడింది. నిఘా విమానమైన ఇ-3 సెంట్రీ (అవాక్స్) పూర్తిగా ధ్వంసం కావడంతో 270 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. కెసి-135 స్ట్రాటోట్యాంకర్ యుద్ధ విమానాల్లో ఒకటి కూలిపోగా, ఐదు ధ్వంసమయ్యాయి. ఇవి ఒక్కో విమానం 165 మిలియన్ డాలర్లు ఉంటుంది. ఎఫ్-15 ఈ స్ట్రైక్ ఈగిల్ యుద్ధ విమానాలు మూడు కూలిపోయాయి. ఇవి ఒక్కోటి 100 మిలియన్ డాలర్లు ఉంటుంది. అత్యాధునిక జెట్ అయిన ఎఫ్-35ఎ లైట్నింగ్ ఎఎ అత్యవసర ల్యాండింగ్ అయి ధ్వంసమైంది. దీనికి 82.5 మిలియన్ డాలర్లు ఉంటుంది. దాదాపు పన్నెండుకు పైగా ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు కూలిపోయాయి. వీటితో 30- 40 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. రక్షణ రాడార్ ఎఎన్/ టిపివై-2 (థాడ్) ధ్వంసం కావడంతో 500 మిలియన్ డాలర్ల నష్టం జరిగింది. దీనిని విశ్లేషిస్తే, అమెరికా తన అత్యాధునిక సాంకేతికతను ఇరాన్ వంటి దేశం ఎదురుదాడులనుంచి కాపాడుకోవడంలో విఫలమైందని స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఎఫ్-15ఇ విమానాలు కువైట్ విమానాల ద్వారా పొరపాటున కూల్చివేయబడడం, అమెరికా నాయకత్వంలోని కూటమిలో సమన్వయ లోపాన్ని సూచిస్తోంది. అమెరికా తన అత్యంత ఖరీదైన క్షిపణి రక్షణ వ్యవస్థ అయిన థాడ్ (టర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్), దాని రాడార్ ఎఎన్/టివివై-2పై అమితమైన విశ్వాసాన్ని ఉంచింది. ఈ వ్యవస్థ అంతరిక్షం నుంచి వచ్చే హైపర్సోనిక్ క్షిపణులను కూడా గుర్తించగలదు. కానీ ఇరాన్ యుద్ధం ఒక 'సాంకేతిక వైరుధ్యాన్ని' బయటపెట్టింది. కోట్లాది డాలర్ల విలువైన ఈ రాడార్ వ్యవస్థలు కేవలం 35,000 డాలర్ల విలువ చేసే చిన్న డ్రోన్ల దాడికి ఛిద్రమైపోయాయి. జోర్డాన్‌లోని మువాఫక్ సల్తీ ఎయిర్ బేస్ వద్ద ఉన్న ఎఎన్/టిపివై-2 రాడార్ ఇరాన్ దాడుల్లో ధ్వంసం కావడం అమెరికాకు కోలుకోలేని దెబ్బ. ఈ రాడార్‌లు ఒకచోట స్థిరంగా ఉండడంవల్ల శత్రువులకు సులభమైన లక్ష్యాలుగా మారుతున్నాయి. అత్యాధునిక రాడార్ అరేలు ఎంత సున్నితంగా ఉంటాయంటే, ఒక చిన్న పేలుడు కూడా ఆ వ్యవస్థను పూర్తిగా పనికిరాకుండా చేయగలదు. ఈ వైఫల్యం వల్ల ఇరాన్‌నుంచి వచ్చే క్షిపణులను గుర్తించడంలో జాప్యం జరుగుతోంది. ఇది ఇజ్రాయెల్, ఇతర గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను మరింత ప్రమాదంలోకి నెట్టివేస్తోంది. ఈ యుద్ధం అమెరికా ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావాన్ని చూపుతోంది. ఇప్పటికే 39 ట్రిలియన్ డాలర్ల రుణభారంతో ఉన్న అమెరికా, ఈ యుద్ధం కోసం అదనంగా 200 బిలియన్ డాలర్ల అత్యవసర నిధుల కోసం పెంటగాన్ ద్వారా వైట్ హౌస్‌ను కోరింది. యుద్ధం మొదలైన మొదటి మూడు వారాల్లోనే సుమారు 3 బిలియన్ డాలర్ల విలువైన సైనిక పరికరాలు ధ్వంసమయ్యాయి. అమెరికా ట్రెజరీ బాండ్ల మార్కెట్, సాధారణంగా యుద్ధ సమయాల్లో సురక్షితమైన పెట్టుబడిగా భావించబడుతుంది. కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. పెట్టుబడిదారులు అమెరికా ప్రభుత్వం తన అప్పులను తీర్చగలదా అనే అనుమానంతో బాండ్లను విక్రయిస్తున్నారు. దీనివల్ల గ్లోబల్ బాండ్ మార్కెట్ నుంచి మార్చి నెలలోనే 2.5 ట్రిలియన్ డాలర్ల విలువ ఆవిరైపోయింది. ద్రవ్యోల్బణం 4.2 శాతానికి పెరగడం, పెట్రోల్ ధరలు గ్యాలన్‌కు 4 డాలర్లకు చేరువ కావడం అమెరికా సామాన్యుడి నడ్డి విరుస్తోంది. ఈ గణాంకాలు అమెరికా ఆర్థికంగా ఎంత పటిష్టమైన దేశమో నిరూపిస్తున్నాయి. ప్రపంచంలో డాలర్ ఆధిపత్యం తగ్గిపోతుండడం ఈ పతనానికి ప్రధాన సంకేతం. ఇజ్రాయెల్ తన సాంకేతిక నైపుణ్యంతో ఇరాన్‌పై దాడులు చేస్తున్నప్పటికీ, లోతుగా పరిశీలిస్తే ఆ దేశం అమెరికా ఇచ్చే 'సైనిక ప్రాణవాయువు' (స్ట్రాటజిక్ ఆక్సిజన్ పైపులైన్) మీద పూర్తిగా ఆధారపడి ఉందని అర్థమవుతోంది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు గతంలో తాము స్వయం సమృద్ధి సాధిస్తామని ప్రగల్భాలు పలికినప్పటికీ, యుద్ధం మొదలైన కొద్ది రోజుల్లోనే ఆ దేశ మందుగుండు సామాగ్రి నిల్వలు నిండుకున్నాయి. అమెరికా సరఫరా చేసే మందుగుండు లేకపోతే ఇజ్రాయెల్ ఒక్క వారం కూడా యుద్ధం చేయలేదని విశ్లేషకులు చెబుతున్నారు. ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు పూర్తిగా 'యుద్ధ ఆర్థిక వ్యవస్థ'గా (వార్ఎకానమీ) మారిపోయింది. పౌర రంగాలు, పర్యాటకం, వ్యవసాయం పూర్తిగా కుప్పకూలిపోయాయి.

కేవలం సైనిక ఎగుమతులు మాత్రమే ఆ దేశాన్ని కాపాడుతున్నాయి. 2024లో 15బిలియన్ డాలర్ల రక్షణ ఎగుమతులు చేసిన ఇజ్రాయెల్, ఇప్పుడు తన ఉనికి కోసం ప్రతి వనరును యుద్ధానికే మళ్లిస్తోంది. ఇది ఇజ్రాయెల్‌ను ఒక 'సూపర్ స్పార్టా' దేశంగా మార్చేసింది. అంటే నిరంతరం యుద్ధం మీదనే ఆధారపడే స్థితి. మార్చి 4, 2026న ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూసివేయడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒక అణుబాంబు వంటి ప్రభావాన్ని చూపింది. ప్రపంచంలోని 20% చమురు సరఫరా, గణనీయమైన గ్యాస్ సరఫరా ఈ మార్గం ద్వారానే జరుగుతుంది. ఇరాన్ ఇప్పుడు ఈ మార్గాన్ని తన నియంత్రణలోకి తీసుకొని, చమురు రవాణా చేసే నౌకల నుంచి సుంకాలను కేవలం చైనీస్ యువాన్‌లో మాత్రమే వసూలు చేస్తోంది. ఇది అమెరికా డాలర్ ఆధిపత్యానికి పడిన అతిపెద్ద దెబ్బ. చైనా క్రాస్-బోర్డర్ పేమెంట్ సిస్టమ్‌ద్వారా లావాదేవీలు జరగడం వల్ల అమెరికా ఆంక్షలు నిర్వీర్యమయ్యాయి. గల్ఫ్ దేశాలు కూడా ఇప్పుడు అమెరికా రక్షణ కవచం బలహీనపడడంతో తమ ఆర్థిక మార్గాలను చైనా వైపు మళ్లిస్తున్నాయి. ప్రస్తుత యుద్ధం ఒక సరికొత్త భౌగోళిక రాజకీయ మార్పును తెచ్చినట్టు కనిపిస్తోంది. అమెరికా అస్థిరమైన నాయకత్వాన్ని చూసిన జపాన్, జర్మనీ వంటి దేశాలు కూడా ఇప్పుడు తమ భద్రత కోసం ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నాయి. రష్యా బహిరంగంగా అమెరికా దాడులను ఖండిస్తూనే, తెరవెనుక ఇరాన్‌కు ఉపగ్రహ సమాచారాన్ని, డ్రోన్ యుద్ధతంత్రాలను అందిస్తోంది. ఉక్రెయిన్ యుద్ధంలో బిజీగా ఉన్నప్పటికీ, ఇరాన్‌ను అమెరికా పతనానికి ఒక ఆయుధంగా రష్యా వాడుకుంటోంది. చైనా నేరుగా యుద్ధంలోకి దిగకుండానే ఆర్థికంగా అమెరికాను దెబ్బతీస్తోంది. ఇరాన్‌కు ఆర్థిక అండగా నిలుస్తూ, బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌతాఫ్రికా) కూటమి ద్వారా ప్రత్యామ్నాయ ప్రపంచ క్రమాన్ని నిర్మిస్తోంది. భారతదేశం వ్యూహాత్మక మౌనాన్ని పాటిస్తూనే, తన ఇంధన భద్రత కోసం రష్యా, ఇరాన్‌లతో సంబంధాలను కొనసాగిస్తోంది. అమెరికా బలహీనపడడంవల్ల దానికి సాగిలపడకపోతే ఇండియా వంటి దేశాలకు ప్రపంచ స్థాయిలో నిర్ణయాత్మక పాత్ర పోషించే అవకాశం పెరుగుతుందనుకోవచ్చు.

# జామకాయను తొక్కతో తింటే ఏమవుతుంది..?

తక్కువ ధరలో ఎక్కువ పోషకాలు లభించే పండు ఏదైనా ఉందంటే అది జామ మాత్రమే. విటమిన్ సి, ఎ, బి, కె లతో పాటు ఫైబర్ పుష్కలంగా ఉండే జామకాయను పేదవాని ఆపిల్ అని పిలుస్తారు. అయితే జామకాయను తినే విషయంలో చాలామందికి ఒక సందేహం ఉంటుంది.. దానిని తొక్కతో పాటు తినాలా లేక తొక్క తీసేసి తినాలా? అలాగే పండు కంటే కాయ మేలా? దీనిపై ప్రముఖ పోషకాహార నిపుణురాలు దీప్షిక సోషల్ మీడియా వేదికగా పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తొక్కలోనే అసలైన పోషకాలు: నిపుణుల అభిప్రాయం ప్రకారం.. జామకాయను తొక్కతో పాటు తినడమే అత్యంత శ్రేయస్కరం. జామ తొక్కలో పొటాషియం, జింక్, విటమిన్ సి వంటి సూక్ష్మపోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మధుమేహం, కొలెస్ట్రాల్ ఉన్నవారికి వరం: అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడేవారు జామకాయను తొక్క తీయకుండా తినడం వల్ల మెరుగైన ఫలితాలు ఉంటాయని కొన్ని అధ్యయనాలు నిరూపించాయి. ఇందులోని ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది.జామకాయ లబ జామపండు: జామకాయ, పండు రెండింటిలోనూ పోషకాలు ఉన్నప్పటికీ, ఆరోగ్య అవసరాలను బట్టి ఎంపిక చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బరువు తగ్గాలనుకునే వారికి, దంతాల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని చూసే వారికి దోర జామకాయ ఉత్తమం. మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా కాయే మేలు చేస్తుంది.జామపండు: ఇది మృదువుగా, తియ్యగా ఉంటుంది కాబట్టి చిన్న పిల్లలు, వృద్ధులు దీనిని సులభంగా తినవచ్చు. జామపండు త్వరగా జీర్ణమవుతుంది. ఇందులో



విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.వృద్ధులు జామను ఆహారంలో చేర్చుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇందులో ఉండే పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్లు శరీరంలో వాపులు, మంటను తగ్గిస్తాయి. గుండె సంబంధిత సమస్యలు రాకుండా కాపాడతాయి. మొత్తానికి జామ ఎలా తిన్నా ఆరోగ్యమే.. అయితే మీ శరీర తత్వాన్ని బట్టి, మీకు ఉన్న ఆరోగ్య సమస్యలను బట్టి కాయను ఎంచుకోవాలా లేదా పండును ఎంచుకోవాలా అనేది నిర్ణయించుకోవాలి. ముఖ్యంగా తొక్క తీయకుండా తినడం వల్ల పూర్తిస్థాయి పోషకాలను పొందవచ్చని గుర్తుంచుకోండి.

# టమాటో వీరికి అమృతంతో సమానం




టమాటో రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. విటమిన్ ఏ కంటిచూపును మెరుగుపరుస్తుంది, ఫైబర్ మలబద్ధకాన్ని నివారిస్తుంది, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. యాంటీఆక్సిడెంట్లు, పొటాషియం వంటివి గుండె ఆరోగ్యానికి, రక్తపోటు నియంత్రణకు సహాయపడతాయి. టమాటోలు కేవలం వంటకు రుచిని మాత్రమే కాదు, అపారమైన ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. రోజువారీ ఆహారంలో టమాటాలను చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. టమాటోలో ఉండే పోషకాలు శరీరానికి చాలా ముఖ్యమైనవి. టమాటోలో విటమిన్ ఏ పుష్కలంగా ఉంటుంది. ఇది కంటిచూపును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. క్రమం తప్పకుండా టమాటో తినడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. టమాటోలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. ఇది ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థకు తోడ్పడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా టమాటోలు సహాయపడతాయి. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు లేదా రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవాలనుకునే వారికి ప్రయోజనకరం. టమాటోలోని యాంటీఆక్సిడెంట్లు శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి, మొత్తం ఆరోగ్యాన్ని కాపాడతాయి. పొటాషియంతో నిండిన టమాటోలు రక్తపోటు స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. తద్వారా గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి.

విటమిన్ ఏ, సి, కొల్లాజెన్ సమృద్ధిగా ఉండటం వల్ల టమాటాలు చర్మ ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. ఇవి వృద్ధాప్య సంకేతాలను తగ్గించి, చర్మాన్ని యవ్వనంగా, కాంతివంతంగా ఉంచడంలో తోడ్పడతాయి. టమాటోలను జ్యూస్ రూపంలో లేదా నేరుగా తినడం ద్వారా ఈ ప్రయోజనాలను పొందవచ్చు.

# బ్రెయిన్ సూపర్ యాక్టీవ్‌గా పనిచేయాలా?

మారుతున్న లైఫ్‌స్టైల్, వర్క్ ప్రెజర్ కారణంగా జనాలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాటిలో జ్ఞాపకశక్తి మందగించడం, మతిమరుపు కూడా ఒకటి. ఈ సమస్యలను పరిష్కరించుకొని బ్రెయిన్ సూపర్ యాక్టీవ్‌గా చేసుకోవాలంటే మన రోజువారి జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవాలని అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌కు చెందిన ప్రఖ్యాత న్యూరో సైంటిస్ట్ దయా గ్రాంట్ చెబుతున్నారు. ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవితంలో జనాలు రోజు మొత్తం టెన్షన్, పని ఒత్తిడితోనే గడపుతున్నారు. దీనికి తోడు రోజంతా ఫోన్ వాడడం, ఇలా అనేక రకాల పనులతో మన బ్రెయిన్‌కు రెస్ట్ లేకుండా చేస్తున్నారు. దీని వల్ల మతిమరుపు, జ్ఞానపశక్తి మందగించడం, లోచించే శక్తి లోపించడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను అదిగమించేందుకు జనాలు అనేక రకాల మందులను వాడుతూ ఉంటారు. కానీ మన జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా ఈజీగా మన బ్రెయిన్‌ను సూపర్ యాక్టీవ్‌గా మార్చుకోవచ్చని న్యూరో సైంటిస్ట్‌లు చెబుతున్నారు. ఈ అలవాట్లు మన బ్రెయిన్‌ను ఎప్పుడూ యాక్టీవ్‌గా ఉండేలా చేస్తాయి అంటున్నారు. మెదడుకు ఫ్రీటైం: న్యూరో సైంటిస్ట్ ప్రకారం రోజంతా మనం పనిలో మునిగిపోవడం, ఫోన్‌లో గడపం వల్ల మన బ్రెయిన్‌పై ఒత్తిడి పెరుగుతుందని.. కాబట్టి దానికి కాస్తా ఫ్రీటైం ఇచ్చేందుకు ప్రతి రోజూ కొద్ది సమయం ప్రకృతిలో గడపాలని చెబుతున్నారు. ఇలా చేయడం ద్వారా ఇది మెదడు ప్రశాంతత దొరికి తనను తాను



రీసెట్ చేసుకుంటుందని చెబుతున్నారు. ఈ ప్రక్రియ మీ బ్రెయిన్‌లో కొత్త ఆలోచనలకు సహకరిస్తుందని, అలాగే రోజంతా మీ బ్రయిన్‌ను యాక్టీవ్‌గా ఉంచుతుందని చెబుతున్నారు. స్కిల్స్ పెంచుకోవడం, పజిల్స్ పరిష్కరించడం: మీ బ్రెయిన్ యాక్టీవ్‌గా పనిచేయాలి అంటే మీరు ఎప్పుడూ ఫోన్ పట్టుకొని కూర్చోవడం కాకుండా కొత్త స్కిల్స్ నేర్చుకోవడం, ఫజిల్‌లను పరిష్కరించడం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.అలాగే పియానో వంటి వాటిని నేర్చుకోవాలని సూచిస్తున్నారు. సంగీత వాయిద్యాలను వాయించడం వల్ల మెదడు జ్ఞాపకశక్తి, నిర్ణయం తీసుకునే నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు.ప్రాణాయామం: పని మధ్యలో మానసికంగా అలసిపోయినప్పుడు నాడి శోధన ప్రాణాయామం చేయాలని చూసిస్తున్నారు. ఇందుకోసం ప్రశాంతమైన ప్లేస్‌లో కూర్చొని ఒక ముక్కు రంధ్రాన్ని మూసివేసి, మరొక ముక్కు ద్వారా కొన్ని నిమిషాలు గాలి పీల్చు?కోవాలని చెబుతున్నారు. ఈ సాధారణ చర్య మీ ఏకాగ్రతను పెంచడంతో

పాటు మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. న్యూరో సైంటిస్ట్ చెప్పినట్లుగా, మెదడుకు ఎక్కువ పని చేయడం కంటే కొంత విశ్రాంతి మరియు సరైన అలవాట్లను ఇవ్వడం చాలా ముఖ్యం. ప్రతిరోజూ మీ కోసం కొంత సమయం కేటాయించండి, ప్రాణాయామం చేయండి మరియు పాత అలవాట్లకు తిరిగి వెళ్లండి. అప్పుడే మీ మెదడు పదునుగా ఉంటుంది.

# డైలమాలో స్టార్ డైరెక్టర్లు..



## నేహా శెట్టి పీచ్ చీరలో టైమ్‌లెస్ గాంభీర్యంతో స్టన్ చేసింది

వరుస విజయా



వరుస విజయాలతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన అగ్ర దర్శకులు కొందరిప్పుడు డైలమా లో కనిపిస్తున్నారు. గత చిత్రాలు ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించకపోవడంతోనే ఈ డైలామకు తెర తీసింది. బోయపాటి శ్రీను, హరీష్ శంకర్, మారుతి , కొరటాల శివ వంటి స్టార్ డైరెక్టర్ల తదుపరి ప్రాజెక్టులపై సందిగ్ధత నెలకొంది. ఏ హీరోతో సినిమా పట్టాలెక్కుతుందో? అసలు తదుపరి కథ ఏమిటో? అనే విషయంలో స్పష్టత లేకపోవడం ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మాస్ యాక్షన్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన బోయపాటి శ్రీను -స్కంద- పరాజయంతో ఒక్కసారిగా రేసులో వెనుకబడ్డారు. అనంతరం బాలయ్య తో తెరకెక్కించిన -అఖండ 2- పాన్ ఇండియాలో భారీ అంచనాల మధ్య రిలీజ్ అయినా వాటిని అందుకోవడంలో విఫలమైంది. దీంతో బోయపాటి నెక్స్ట్ హీరో ఎవరవుతారు? అన్నది ఆసక్తికరంగా మారింది. బోయపాటికి మాస్ పల్స్ తెలిసిన దర్శకుడిగా పేరున్నా సరైన హిట్ పడితే తప్ప ఆయన మళ్ళీ ఫామ్‌లోకి రావడం కష్టమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం బోయపాటి స్క్రిప్ట్‌ను మరింత పక్కాగా సిద్ధం చేసుకునే పనిలో ఉన్నట్లు తెలిసింది.

పవర్ ఫుల్ డైలాగ్స్ , కమర్షియల్ ప్యాకేజీకి పెట్టింది పేరైన హరీష్ శంకర్ పరిస్థితి కూడా అలాగే కనిపిస్తుంది.-మిస్టర్ బచ్చన్- ఫలితం ఆయన కెరీర్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపింది. దీంతో దర్శకుడిగా రెండేళ్లు గ్యాప్ ఏర్పడింది. పవన్ కళ్యాణ్ దయ తలచడంతో? -ఉస్తాద్ భగత్ సింగ్- కి అవకాశం వచ్చినా? తాజాగా రిలీజ్ అయిన ఆ సినిమా ఆశించిన స్థాయిలో రాణించని సంగతి తెలిసిందే. దీంతో హరీష్ శంకర్ రైటింగ్ స్టైల్ మారాలన్నది నెట్టింట చర్చగా మారింది. ప్రస్తుతం హరీష్ హీరో కంటేముందు సరైన కథపై దృష్టి పెడితే తప్ప లాభం లేదు. చిన్న సినిమాలను పెద్ద హిట్లుగా మార్చిన దర్శకుడు మారుతి. -ది రాజాసాబ్- రూపంలో మారుతికి కూడా గట్టిగానే దెబ్బ పడింది. ప్రస్తుతం ఈయన కూడా బౌన్స్ బ్యాక్ కోసం ఎదురు చూస్తున్నాడు.దీనిలో భాగంగా కథపై కసరత్తులు చేస్తున్నాడు. అలాగే సెన్సిబుల్ పాయింట్స్‌ను కమర్షియల్ ఎలిమెంట్స్‌తో చెప్పడంలో దిట్ట అయిన కొరటాల శివకు -ఆచార్య- రూపంలో తొలి పరాజయం నమోదైంది. అనంతరం ఎన్టీఆర్ తో తెరకెక్కించిన -దేవర- మొదటి భాగం మిశ్రమ ఫలితాలు సాధించిన సంగతి తెలిసిందే. అయినా కొరటాల అన్ని లెక్కలు -దేవర 2 -తో సరి చేస్తాను అన్న కాన్ఫిడెన్స్ తో ఉన్నాడు. కానీ తారక్ సీన్ లోకి వచ్చే వరకూ గానీ పట్టాలెక్కుతుందా? లేదా? అన్నది చెప్పలేం. అగ్ర హీరోలంతా తమ కాల్‌షీట్లను రెండు మూడేళ్ల వరకు లాక్ చేసుకోవడం ఇలాంటి వారిపై కొంత ప్రభావాన్ని చూపిస్తుంది. ప్రస్తుతం ఈ దర్శకులంతా ఇప్పుడు ఒకే సూత్రాన్ని నమ్ముతున్నారు. అదే నిరంతర ప్రయత్నం. ఇండస్ట్రీలో సక్సెస్ ఉంటేనే మరో ఛాన్స్. లేదంటే? ఈ పోటీలో నెట్టుకురావడం కష్టమని వారికీ బాగా తెలుసు.



## ప్రియాంక జవాల్కర్ గోల్డెన్ అవర్ గ్లామ్ లుక్‌లో మెరిసింది

# కథలపై బాలయ్య ఫోకస్ మారిందా?



నందమూరి బాలకృష్ణ తన తర్వాతి సినిమాల విషయంలో రూటు మారుస్తున్నారు. వరుసగా కుర్ర దర్శకులతో సినిమాలు చేయడానికి మొగ్గు చూపుతున్నారని తెలుస్తోంది. రెగ్యులర్ కమర్షియల్ సక్సెస్ కాంబినేషన్స్ కంటే ఫ్యూచర్ ప్రాజెక్టుల కోసం కంటెంట్ ఉన్న కుర్ర మేకర్స్ కోసం ఫోకస్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. నందమూరి బాలకృష్ణ ప్రయోగాలు చేయడానికి సిద్ధంగానే ఉన్నా ఆ రేంజ్ కు తగ్గట్టు కథలు సిద్ధం చేసే వారు తక్కువ.ఇక ప్రస్తుతం కొత్త కాంబినేషన్స్ పై రకరకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే సరిపోదా శనివారం దర్శకుడు వివేకా ఆత్రేయతో ఒక క్రైమ్ థ్రిల్లర్ కథపై చర్చలు జరుపుతున్నట్లు టాక్ వచ్చింది. ఈ దర్శకుడు రజినీకాంత్ తరువాత మళ్ళీ బాలయ్యపై ఫోకస్ పెంచినట్లు తెలుస్తోంది. మరోవైపు 'నాంది' సినిమాతో మంచి పేరు తెచ్చుకున్న విజయ్ కనకమేడల, రీసెంట్ గా బాలయ్యను కలిసి ఒక పవర్‌ఫుల్ పోలీస్ స్టోరీ వినిపించినట్లు గట్టిగా టాక్ వినిపిస్తోంది.బాలయ్యకు పోలీస్ డ్రెస్ వేయడమంటే మామూలు విషయం కాదు, అందులోనూ విజయ్ తీసే సినిమాలు చాలా సీరియస్ గా, రఫ్ గా ఉంటాయి కాబట్టి ఈ కాంబినేషన్ మీద క్లారిటీ రాకముందే అంచనాలు పెరిగిపోతున్నాయి. ?అయితే విజయ్ అల్లరి నరేష్ తో తీసిన సినిమా 'నాంది' సూపర్ హిట్ అయినా, ఆ తర్వాత వచ్చిన 'ఉగ్రం' మాత్రం బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. దీంతో ఈ యంగ్ డైరెక్టర్ ఇప్పుడు బాలయ్య లాంటి పెద్ద హీరోను ఎలా హ్యాండిల్ చేస్తారో అన్న అనుమానాలు కొందరిలో ఉన్నాయి. కానీ విజయ్ దగ్గర మంచి కంటెంట్ ఉంటే మాత్రం బాలయ్య లాంటి మాస్ హీరో దొరికితే అది ఖచ్చితంగా వెండితెరపై ఒక రేంజ్ లో ఉంటుందని చెప్పొచ్చు.

?మరోవైపు బాలకృష్ణ కూడా ఇప్పుడు చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. భారీ అంచనాలతో వచ్చిన 'అఖండ 2' అంతగా వర్కవుట్ కాలేదు. దీంతో కేవలం బిల్డప్ సీన్లు మాత్రమే ఉంటే సరిపోదని, కథలో దమ్ముండాలని బాలయ్య ఫిక్స్ అయ్యారు. అందుకే విజయ్ కనకమేడల చెప్పిన ఆ సీరియస్ పోలీస్ డ్రామా బాలయ్యకు నచ్చిందని, అందుకే ఈ ప్రాజెక్ట్ ఓకే అయ్యే ఛాన్స్ ఉందని అంటున్నారు. రొటీన్ మాస్ మసాలా కాకుండా ఏదైనా కొత్తగా ట్రై చేయాలనేది బాలయ్య ప్లాన్ కావొచ్చు. ప్రస్తుతానికి ఇది ఇండస్ట్రీలో నడుస్తున్న ఒక టాక్ మాత్రమే. ఇంకా అఫీషియల్ గా ఏమీ అనౌన్స్ చేయలేదు. ఒకవేళ ఈ కాంబినేషన్ సెట్ అయితే మాత్రం బాలయ్యను మరోసారి పవర్‌ఫుల్ పోలీస్ గెటప్‌లో చూడొచ్చు. విజయ్ కనకమేడల తన మార్క్ సీరియస్ కథతో బాలయ్యను ఏ రేంజ్ లో చూపిస్తారో అన్నది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. మరి ఈ యంగ్ డైరెక్టర్ బాలయ్యను మెప్పించి షూటింగ్ మొదలుపెడతారో లేదో వేచి చూడాలి.

Printed, Published and Owned by VENKATESHWARLU VUPPALA, Printed at KRK Printers #2-3-703, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013, Published at # 502, Kubera Towers, Narayanaguda, Hyderabad, Telangana -500029, Editor : VENKATESHWARLU VUPPALA, RNI NO: TELTEL/2021/81802, CELL NO: 8125551235, newsindiatelugudaily@gmail.com